మన ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# ప్రజా ప్రతినిధి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :274 గురువారం జూలై 302026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## మానవ అక్రమ రవాణా ఉచ్చులో ప్రపంచం

- స్వేచ్ఛను కబళిస్తున్న అక్రమ రవాణా
- ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ముఠాలు
- మానవ అక్రమ రవాణాపై ప్రపంచ హెచ్చరిక



జూలై 29 (మనప్రజాప్రతినిధి): ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న మానవ అక్రమ రవాణా ఇప్పుడు కొత్త రూపం దాల్చింది. ఉద్యోగాలు, విదేశీ ఉపాధి, అధిక వేతనాల పేరుతో యువతను మోసగించి ఆన్‌లైన్ మోస కేంద్రాల్లో బలవంతంగా పనిచేయిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జూలై 30న నిర్వహించే మానవ అక్రమ రవాణా వ్యతిరేక ప్రపంచ దినోత్సవానికి ఈ ఏడాది “ఆన్‌లైన్ మోసాల వెనుక చిక్కుకున్న జీవితాలు“ అనే అంశాన్ని ప్రధాన సందేశంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. మోసపూరిత ఉద్యోగ ప్రకటనల ద్వారా వేలాది మంది అంతర్జాతీయ నేర ముఠాల బారిన పడుతున్నారని హెచ్చరించింది. ప్రపంచంలోని అనేక దేశాల్లో యువతకు అధిక జీతాలు, సాంకేతిక ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు కల్పిస్తామని చెప్పి తీసుకెళ్లిన తర్వాత వారిని నిర్బంధించి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా బలవంతం చేస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. నిరాకరిస్తే శారీరక హింస, బెదిరింపులు, నిర్బంధం వంటి అమానుష చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఈ నేరాల వెనుక అంతర్జాతీయ

2

## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం...



- యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదించిన సభ
- పేపర్ లీక్‌లపై మరింత కఠిన శిక్షలకు మార్గం సుగమం

2

## ఖమ్మం పర్యటనకు మనోజ్ సిన్హా



- లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఘన స్వాగతం
- జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష
- సంక్షేమం, పారిశ్రామిక ప్రగతిపై కలెక్టర్ వివరణ
- పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు ప్రయాణం

2

## నదీ జలాలపై కీలక చర్చ



- ఢిల్లీలో తెలంగాణకర్ణాటక నేతల భేటీ
- కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌తో సమావేశం
- తుంగభద్ర, కృష్ణా జలాలపై సమాలోచనలు
- అంతర్రాష్ట్ర జల సమస్యల పరిష్కారంపై దృష్టి

2

## తైవాన్ పెట్టుబడులకు ఏపీ సిద్ధం

-ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ రంగాలపై దృష్టి

-చంద్రబాబుతో తైవాన్ ప్రతినిధుల భేటీ

-నైపుణ్యాభివృద్ధిపై లోకేశ్‌తో చర్చలు



-పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కొత్త ఊతం

అమరావతి, జూలై 29 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. తైవాన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధి బృందం బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమై పెట్టుబడులు, పారిశ్రామిక భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించింది. డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, శాండ్ సన్, జిలీ కన్‌స్ట్రక్షన్స్ తదితర సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పారిశ్రామిక వాతావరణం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి వారికి వివరించారు. ప్రపంచ స్థాయి పోర్టులు, విమానాశ్రయాలు, రహదారులు, రైల్వే అనుసంధానంతో ఆంధ్రప్రదేశ్ బలమైన పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతోందని పేర్కొన్నారు.ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఎగుమతి ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విధానపరమైన స్థిరత్వం, వేగవంతమైన అనుమతులు, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమల విస్తరణకు అనువైన వాతావరణాన్ని ప్రభుత్వం నిరంతరం కల్పిస్తోందని వెల్లడించారు. భారత్‌లో ఇప్పటికే తైవాన్ సంస్థలు తయారీ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నామని ప్రతినిధి బృందం తెలిపింది. సాంకేతికత, తయారీ, పారిశ్రామికాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరుపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ సమావేశాలు రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులకు కొత్త అవకాశాలు తీసుకురానున్నాయని అధికారులు భావిస్తున్నారు.అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో జరిగిన సమావేశంలో మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణపై ప్రధానంగా చర్చించారు. తైవాన్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో ఏపీ యువతను తీర్చిదిద్దేందుకు శిక్షణా కార్యక్రమాలు, ఉన్నత విద్యా భాగస్వామ్యం, సెమీ కండక్టర్లు, ప్రిసిషన్ ఇంజనీరింగ్, పారిశ్రామిక స్వయంచాలకీకరణ వంటి రంగాల్లో ప్రత్యేక శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్ ఏర్పాటు, మాండరిన్ భాషా శిక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ధ్రువీకరణ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థులుఅధ్యాపకుల పరస్పర మార్పిడి, సంయుక్త పరిశోధనలపై కూడా సమావేశంలో చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌తైవాన్ మధ్య పారిశ్రామిక, సాంకేతిక సహకారానికి ఈ సమావేశాలు కీలక మైలురాయిగా నిలుస్తాయని, పెట్టుబడులతో పాటు యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## ఖమ్మంలో అభివృద్ధికి శ్రీకారం



- రూ.7.21 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ
- రైతులకు రూ.21 వేల కోట్ల రుణభారం తగ్గిందన్న మంత్రి
- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

2

## పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కవిత



- యశోద ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా
- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

హైదరాబాద్, జూలై 29 (మనప్రజాప్రతినిధి): సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి అందుతున్న వైద్యం, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన కవిత, చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. వైద్య బృందం అందిస్తున్న సేవలను గురించి కూడా ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి భార్యతో పాటు ఇతర కుటుంబ సభ్యులను కలిసి

2

# మానవ అక్రమ రవాణా ఉచ్చులో ప్రపంచం

మెదటి పేజీ తరువాయి



వ్యవస్థీకృత నేర ముఠాలు, సైబర్ నేరాలు, నల్లధన చలామణి పరస్పరం అనుసంధానమై ఉన్నాయని వెల్లడించింది. మానవ అక్రమ రవాణా ఇప్పుడు కేవలం లైంగిక దోపిడీ లేదా బలవంతపు శ్రమకే పరిమితం కావడం లేదు. డిజిటల్ యుగంలో నేరగాళ్లు సామాజిక మాధ్యమాలు, నకిలీ ఉద్యోగ వెబ్‌సైట్లు, సందేశాల వేదికలు, తప్పుడు నియామక సంస్థలను వినియోగించి బాధితులను వలలో వేసుకుంటున్నారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల వ్యక్తిగత వివరాలను సేకరించి వారిని విదేశాలకు రప్పించి, అక్కడ అక్రమ మోస కేంద్రాల్లో బంధించి సైబర్ మోసాలకు ఉపయోగిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కూడా ఈ ఏడాది సందేశంలో బలవంతపు ఆన్‌లైన్ మోస కేంద్రాలు మానవ అక్రమ రవాణాలో అత్యంత వేగంగా పెరుగుతున్న రూపంగా మారాయని హెచ్చరించారు. కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలను కూడా నేరగాళ్లు తమ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని, ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే ప్రపంచ దేశాలు సమాచార భాగస్వామ్యం, చట్ట అమలు సంస్థల సమన్వయం, ఆర్థిక నేరాల నియంత్రణలో మరింత బలంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. భారత్‌లో కూడా ఉద్యోగాల పేరుతో విదేశాలకు వెళ్లే యువత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన నియామక సంస్థల ద్వారానే విదేశీ ఉద్యోగాలకు వెళ్లడం, ఒప్పంద పత్రాలను పూర్తిగా పరిశీలించడం, కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం అందించడం, గుర్తింపు లేని వ్యక్తులు లేదా సంస్థల ఆఫర్లను నమ్మకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా మధ్య సంబంధం పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ అవగాహన కూడా అత్యంత అవసరమని చెబుతున్నారు. మానవ అక్రమ రవాణా అనేది మానవ హక్కులపై జరిగే అత్యంత దారుణమైన దాడుల్లో ఒకటి. దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వాలు, దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉంది. అనుమానాస్పద నియామకాలు, అక్రమ తరలింపులు, మోసపూరిత ఉద్యోగ ప్రకటనలపై వెంటనే అధికారులకు సమాచారం అందించడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక ప్రపంచ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, మానవ గౌరవాన్ని కాపాడే సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిస్తోంది.

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం...

మెదటి పేజీ తరువాయి



న్యూఢిల్లీ, జూలై 29 (మన ప్రజాప్రతినిధి): పరీక్షల్లో అక్రమాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష సభ్యులు "మాకు న్యాయం కావాలి" అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేసినప్పటికీ, మూజువాణి ఓటుతో బిల్లును సభ ఆమోదించింది. బిల్లును ఉభయసభల సంయుక్త కమిటీకి పంపాలని కొందరు సభ్యులు చేసిన డిమాండ్లు, వారు ప్రతిపాదించిన సవరణలను స్పీకర్ ఓం బిర్లా తిరస్కరించినట్లు ప్రకటించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సమాధానమిచ్చారు. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో సవరణలు తీసుకొచ్చామని ఆయన తెలిపారు. పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను కాపాడటం, విద్యార్థుల భవిష్యత్తును రక్షించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ దేశంలో 152 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయని చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని జితేంద్ర సింగ్ అన్నారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సభా సంప్రదాయాలకు విరుద్ధమైన, అప్రజాస్వామిక పదజాలాన్ని ఉపయోగించారని విమర్శించారు. పార్లమెంటరీ నిబంధనలను గౌరవిస్తూ చర్చ జరగాల్సిన సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం బాధాకరమని వ్యాఖ్యానించారు. కాల్పుల ఆదేశాలపై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను కూడా జితేంద్ర సింగ్ ఖండించారు. కాల్పులకు ఆదేశాలు ఇచ్చేది మంత్రి కాదని, మేజిస్ట్రేట్ మాత్రమే అలాంటి నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. అసలు కాల్పులు జరగలేదని, బాష్పవాయువు మాత్రమే ప్రయోగించారని చెప్పారు. అలాగే కేంద్ర హోంమంత్రి విదేశాల్లో ఉన్నారన్న ఆరోపణలను కూడా ఆయన తోసిపుచ్చారు. చట్ట సవరణల ప్రకారం పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారికి కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. జరిమానాను రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచాలని ప్రతిపాదించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొనే సేవల సంస్థలకు విధించే జరిమానాను రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచడంతో పాటు, వాటిపై నిషేధాన్ని నాలుగేళ్ల నుంచి ఎనిమిదేళ్ల వరకు పొడిగించే నిబంధనను చేర్చారు. వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాల్లో పాల్గొన్న సంస్థల డైరెక్టర్లు, ఉన్నతాధికారులకు కనీసం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 కోట్ల వరకు జరిమానా విధించేలా బిల్లులో నిబంధనలు ఉన్నాయి. పెద్ద ఎత్తున జరిగే పరీక్షా కుంభకోణాలకు కనీస శిక్షను ఏడేళ్లకు, కనీస జరిమానాను రూ.10 కోట్లకు పెంచే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. అలాగే పరీక్షా అక్రమాల దర్యాప్తు కోసం ప్రత్యేక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేసి, రెండు నెలల్లోపు దర్యాప్తు పూర్తి చేసే విధంగా బిల్లులో నిబంధనలు చేర్చారు.

# ఖమ్మం పర్యటనకు మనోజ్ సిన్హా

మెదటి పేజీ తరువాయి



ఖమ్మం, జూలై 29 (మనప్రజా ప్రతినిధి): జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఎన్ఎస్‌పీ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా యంత్రాంగం తరఫున స్వాగతం తెలియజేశారు. ఎన్ఎస్‌పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తదనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన మనోజ్ సిన్హాకు కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ రంగం, పారిశ్రామికాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలను వివరించారు. జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి కూడా కలెక్టర్ సమగ్ర నివేదిక సమర్పించారు. అన్ని శాఖల సమన్వయంతో జిల్లా అభివృద్ధిని వేగవంతం చేస్తున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్‌కు వివరించారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై మనోజ్ సిన్హా అధికారులతో చర్చించి పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమర్థవంతమైన పరిపాలన కొనసాగించాలని అధికారులకు సూచించినట్లు అధికారులు తెలిపారు. ఖమ్మం పర్యటనలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, జిల్లా ప్రజల ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాల కోసం హైదరాబాద్‌కు బయలుదేరారు.

# ఖమ్మంలో అభివృద్ధికి శ్రీకారం

మెదటి పేజీ తరువాయి



ఖమ్మం, జూలై 29 (మనప్రజాప్రతినిధి): ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రూ.7.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. డాక్యా తండాలో రూ.1.41 కోట్లతో మంగళగూడెండాక్యా తండా రహదారి, పల్లెగూడెంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్ఎస్‌పీ మీదుగా పల్లెగూడెం వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9,200 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి 25 లక్షల మంది రైతులపై రూ.21 వేల కోట్ల రుణభారాన్ని తగ్గించామని చెప్పారు. సన్న వరిధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నట్లు వివరించారు. నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లతో కలిపి ఇప్పటికే మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. మిగిలిన గ్రామాలకు త్వరలోనే రెండో విడత ఇళ్లు మంజూరు చేసి, మూడో, నాలుగో విడతల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గ్రామీణ రహదారులు, తాగునీరు, విద్యాసంస్థలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ భూక్యా శ్రీనివాస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాల పురోగతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# నదీ జలాలపై కీలక చర్చ

మెదటి పేజీ తరువాయి



న్యూఢిల్లీ, జూలై 29 (మనప్రజాప్రతినిధి): అంతర్రాష్ట్ర నదీ జలాల అంశాలపై తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య కీలక చర్చలు జరిగాయి. ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌తో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమై ఇరు రాష్ట్రాలకు సంబంధించిన జల అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా తుంగభద్ర, కృష్ణా నదీ జలాల వినియోగం, అంతర్రాష్ట్ర జలాల పంపిణీ, ఇరు రాష్ట్రాల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. జల వనరుల వినియోగంలో పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని నేతలు ప్రస్తావించారు. నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన నీటి లభ్యత, భవిష్యత్ కార్యాచరణ, నదీ జలాల సమర్థ వినియోగంపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. ఇరు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరస్పర అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలని చర్చించారు. రైతుల సాగునీటి అవసరాలు, తాగునీటి భద్రత, జల వనరుల పరిరక్షణ వంటి అంశాలపై కూడా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. అంతర్రాష్ట్ర జలాల అంశాల్లో సహకార స్ఫూర్తితో ముందుకు సాగాలని ఇరు రాష్ట్రాల నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం తెలంగాణకర్ణాటక రాష్ట్రాల మధ్య జల సంబంధిత అంశాలపై సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలకంగా మారనుంది. తుంగభద్ర, కృష్ణా నదీ జలాల అంశాల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగేందుకు ఇరు రాష్ట్రాలు సిద్ధంగా ఉన్నట్లు సమావేశంలో స్పష్టమైంది.

# పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కవిత

మెదటి పేజీ తరువాయి



పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెబుతూ, ఆయన త్వరగా కోలుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తనతో కలిసి ఉద్యమంలో పనిచేసిన సహచరుడు పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆయనను పరామర్శించి కుటుంబ సభ్యులకు కవిత భరోసా కల్పించారు. ప్రస్తుతం ఆయనకు యశోద ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

# మాజీ బస్సు డ్రైవర్ ఇంట్లో కోట్ల సంపద

## -సోదాల్లో రూ.5 కోట్లకుపైగా నగదు, 15 కిలోల బంగారం స్వాధీనం
## -అక్రమ ఆస్తుల కోణంలో దర్యాప్తు ముమ్మరం





కోల్‌కతా, జూలై 29 (మనప్రజాప్రతినిధి): పశ్చిమ బెంగాల్‌లో మాజీ ప్రభుత్వ బస్సు డ్రైవర్ నివాసంలో నిర్వహించిన సోదాల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం లభ్యమవడంతో అధికారులు విస్తుపోయారు. బీర్భూమ్ జిల్లాలో జరిగిన ఈ సోదాల్లో రూ.5 కోట్లకుపైగా నగదు, సుమారు 15 కిలోల బంగారాన్ని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న నగదును నోట్ల లెక్కింపు యంత్రాలతో లెక్కించే ప్రక్రియ కొనసాగుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, మినార్ మోండల్ తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వ బస్సు డ్రైవర్‌గా పనిచేశాడు. కొన్నేళ్ల క్రితం ఉద్యోగానికి రాజీనామా చేసిన అనంతరం తన బంధువైన స్థానిక వ్యాపారి టులు మోండల్ వద్ద రాళ్ల వ్యాపారంలో చేరాడు. అనంతరం స్వయంగా అదే వ్యాపారాన్ని ప్రారంభించినట్లు సమాచారం. మినార్ మోండల్ అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు కొంతకాలంగా అతని కార్యకలాపాలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో బుధవారం అతని నివాసంలో సోదాలు నిర్వహించగా పెద్ద మొత్తంలో నగదు, బంగారం బయటపడింది. దీంతో అధికారులు నోట్ల లెక్కింపు యంత్రాలను, ప్రత్యేక పెట్టెలను తెప్పించి నగదును లెక్కించే ప్రక్రియ చేపట్టారు. సోదాల్లో లభించిన నగదు, బంగారం మొత్తం ఎంత అన్నది లెక్కింపు పూర్తయిన తర్వాతే ఖరారవుతుందని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నగదు స్వాధీనం ప్రక్రియ కొనసాగుతోందని, అన్ని వివరాలను నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ కూడా భారీగానే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నగదు, బంగారం పూర్తిగా మినార్ మోండల్‌కు చెందినవేనా, లేక అతని బంధువైన టులు మోండల్‌కు సంబంధించినవా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వ్యాపార లావాదేవీలు, ఆదాయ వనరులు, ఆస్తుల వివరాలను పరిశీలిస్తూ సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మాజీ ప్రభుత్వ బస్సు డ్రైవర్ నివాసం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్రమ ఆస్తుల కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, సేకరించిన ఆధారాలు, ఆర్థిక లావాదేవీల వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# గురు పౌర్ణమి సందర్భంగా గురువు సన్మానం



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ( అల్లాదుర్గం ప్రతినిధి) జులై 29 /అల్లాదుర్గం మండలంగడి పెద్దాపూర్ గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ నరసింహులు సార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగాభావిస్తున్నాము. ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ గారు మాట్లాడుతూ"గురువు అనేది కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదు... భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పి."మన గ్రామ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యాభివృద్ధి, వారి క్రమశిక్షణ మరియు ఉన్నత భవిష్యత్తు కోసం ప్రతిరోజూ అంకితభావంతో ఆలోచిస్తూ కృషి చేస్తున్న నరసింహులు సార్ గారి సేవలు నిజంగా అభినందనీయం. ఇలాంటి ఆదర్శ గురువులు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటూ, వారికి హృదయపూర్వక గురు పౌర్ణమి శుభాకాంక్షలు మరియు శుభాభినందనలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులురజినీకాంత్ ,అనిల్ తదితరులు పాల్గొన్నారు"గురువు చూపిన మార్గమే శిష్యుని విజయానికి పునాది."

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జులై 29,: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ అన్నారు. చేగుంట మండలం చందాయిపేట్ లోని రైతు వేదికలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీటి సౌకర్యాలు, సాంకేతిక సలహాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు, ఈ కార్యక్రమం లో సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా,మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్,పంచాయతీ సెక్రటరీ కృష్ణ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్, అన్నం ఆంజనేయులు, వార్డ్ సభ్యులు బుడ్డ మహేష్, వివిధ షాప్ ల ఫర్టిలైజర్ షాప్ లో యజమానులు శ్రీకాంత్, రాజు, బాలకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి దివ్య, భవాని, యాదగిరి,రైతులు ఆనందాస్ ఆంజనేయులు, బాస రాజు, శోభన్, అక్బార్, యూసుఫ్,తదితరులు పాల్గొన్నారు

# పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిన సర్పంచ్ పై డిపిఓ కు వార్డు మెంబర్లు ఫిర్యాదు



- ఆరునెలల్లోనే అవినీతి ఆరోపణలు ఎదుర్కుంటున్న సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తలారి అవినాష్ కుమార్
- నిధుల దుర్వినియోగం పై మొన్న ఎంపీడీవో కు, నిన్న డిపిఓ కు ఫిర్యాదు
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటున్న వార్డు సభ్యులు,గ్రామ ప్రజల



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక అల్లాదుర్గ్ జూలై 29/ టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్ పల్లి గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ పంచాయతీ నిధులు దుర్వినియోగం పై జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యకు బుధవారం గ్రామ వార్డు మెంబర్లు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ నిధులను విచ్చలవిడిగా విత్ డ్రా చేసిన నిధులపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. గ్రామానికి సంబంధించిన నిధులను దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ఆలోచనతో సర్పంచ్ చేతివాటంప్రదర్శిస్తున్నారని , ప్రజల సొమ్మును కాజేస్తున్నారని కొన్ని నిధులకు పంచాయతీ తీర్మానం లేకుండానే విత్ డ్రా లు చేశారనీ వార్డు సభ్యులు అంటున్నారు. గ్రామ పంచాయతీలకు అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయని వార్డు మెంబర్లు ఆరోపించారు. పని చేయని వార్డుల్లో పని చేసినట్లు బిల్లులు తయారు చేసుకొని తనకు ఇష్టం వచ్చినట్టుగా విత్ డ్రాలు చేస్తున్నారని అంటున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడినటువంటి వార్డు మెంబర్లమైన మేము పంచాయతీ లెక్కలు అడగగా నీ స్థాయి ఎంత నువ్వెంత నాకు లెక్కలు అడిగే స్థాయి కాదునిది అని హేళన చేస్తూ చాలా అవమానపరిచారని అన్నారు. ఈ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన బొడ్మట్ పల్లి గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ చేత రికవరీ చేయించి గ్రామ ప్రజలందరికీ పంచాయతీలో ఉన్న నిధుల గురించి తెలియజేసి న్యాయం చేయాలని వారు కోరారు. మొన్న ఎంపీడీవో సత్యనారాయణకు ఫిర్యాదు చేసిన ఎటువంటి స్పందన లేదన్నారు. కావున తమరు ఈ నిధులపై పూర్తి విచారణ జరపాలని వార్డు మెంబర్లు డిమాండ్ చేశారు. ఆరు నెలలోనే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్పంచ్ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తలారి అవినాష్ కుమార్ పై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వార్డు మెంబర్లు కంకర భూషణం, గడ్డం గోపాల్, మహమ్మద్ కరీం, నాయకులు డప్పు పెంటయ్య ఉన్నారు.

# శంకర్రావు పంతులు శ్రీ సంగమేశ్వర మందిరం

శ్రీ రంగంపేట ఆశ్రమం యందు నేడు లోకకళ్యాణార్థమై చాతుర్మాస దీక్షను స్వీకరించుచున్న సందర్భంగా శిష్య బృందం భక్త బృందం తరపున



సదాశివపేట //(మన ప్రజా ప్రతినిధి):సదాశివపేట లో శంకర్రావు పంతులు శ్రీ సంగమేశ్వర మందిరం శ్రీ గురుభ్యోన్నమః శ్రీ సదానంద మఠాధీశ్వరులు శ్రీ గురు మదనానంద పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారు ఆషాడశుద్ధ పౌర్ణిమ నుండి భాద్రపద శుద్ధ పౌర్ణమి వరకు తేదీ29/7/2026 నుండి 26/9/2026 వరకు శ్రీ రంగంపేట ఆశ్రమం యందు నేడు లోకకళ్యాణార్థమై చాతుర్మాస దీక్షను స్వీకరించుచున్న సందర్భంగా శిష్య బృందం భక్త బృందం తరపున శ్రీ బి ఎన్ శంకర్రావు మాట్లాడుతూ శ్రీ స్వామి వారు ప్రతి సంవత్సరం ఈ దీక్ష ఆచరించి ఆ పుణ్యఫలమును సమస్త భక్తజనులకు దారపోయడం ఆనవాయితీ నడియాడే దైవ స్వరూపులు శిష్యులకు భక్తులకు కల్పతరువు నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా దైవచింతన సత్ప్రవర్తన కలిగి ఉండే విధంగా ప్రవచనం ద్వారా జ్ఞాన బోధ చేస్తూ శివాభ్యాన్నమః దత్తాయ నమః ప్రస్తుతం శ్రీమాత్రే నమః వంటి జపములను శిష్యులు భక్తుల ద్వారా ప్రతిరోజు ఆచరింప చేసి వేల కోట్లు పుణ్యఫలితాన్ని దేశాభివృద్ధికి ప్రజల సంక్షేమానికి అర్పితం చేస్తూ ప్రతిరోజు నిరంతరం వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ ఆధ్యాత్మిక ప్రభంజనం ద్వారా అందరిలో నిరంతరం చైతన్య స్ఫూర్తి కలిగిస్తున్న ఏకైక పీఠం శ్రీ సదానంద మఠం బసవ కళ్యాణ్ కర్ణాటక శ్రీ గురు మదనానంద పీఠం తెలంగాణ రాష్ట్రాల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏకైక పీఠాధిపతి యతివరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారు గురు పౌర్ణమి సందర్భంగా సమస్త శిష్య బృందం భక్త బృందం తరపున గురువర్యులకు శతకోటి పాద ప్రణామములు తెలియజేస్తున్నాను

# సమగ్ర భూ రీసర్వే ద్వారా రైతులకు మేలు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక అల్లాదుర్గ్ ( జులై 29/అల్లాదుర్గంభూ భారతి రీ సర్వే వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. అల్లాదుర్గం మండలంలో చేవెళ్ళ గ్రామంలోరైతు వేదికలో బుధవారం నిర్వహించిన సమగ్ర భూ రీ సర్వే లో రైతులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూములు రీ సర్వే ద్వారా భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడవచ్చని అన్నారు. భూ రీ సర్వే ద్వారా ప్రతి రైతుకు పక్కాగా హద్దులు వేస్తారని తెలిపారు. సర్వే జరిగే సమయంలో రైతులు భూముల వద్ద ఉండి అధికారులకుసహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లయ్య మెదక్ ఏడి సర్వేయర్ కిషన్, వ్యవసాయ అధికారి రాజేష్, గ్రామ సర్పంచ్, విరప్ప రైతులు పాల్గొన్నారు

# గుంతలో దిగిన బస్సు, భయంలో విద్యార్థులు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 29.:చేగుంట పట్టణ కేంద్రం మోడల్ స్కూల్ వద్ద బుధవారం సాయంత్రం అర్టీసీ (విద్యార్థినిల) బస్సు వర్షాల కారణంగా మట్టి రోడ్డు బురద గా కావడంతో ఆ బురదకు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడబోయి డ్రైవర్ చాక చక్యంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే చేగుంట మోడల్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థుల కోసం మెదక్ డిపో కు చెందిన టీ ఎస్ 35జెడ్ 0012అనే బస్సును,ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం మోడల్ స్కూల్ నుంచి కర్నాల్ పల్లి, మక్కరాజ్ పేట , చందాయిపేట్, కసన్ పల్లి, పోతన్ పల్లి, చెట్ల తిమ్మాయిపల్లి,స్కూల్ లో చదువుతున్న విద్యార్థులను బస్సులోఎక్కించుకొని గ్రామాలకు తిరిగి వెళుతుండగా (బేసిక్ డ్రైవర్) బస్సును రోడ్డు పక్కకు దించాడు. అక్కడ వర్షాల వల్ల బురద ఉండటంతో బస్సు అదుపు తప్పి గుంతలో దిగింది, చాకచక్కంగా డ్రైవర్ బస్సు ను అదుపులోకి తీసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీనితో విద్యార్థులు ఊపిరి పిలుచుకొని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ తమ గ్రామాలకు చేరుకున్నారు. ఇప్పటికైనా అధికారులు,నాయకులు, వెంటనే స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేయాలని విద్యార్థులు కోరారు.

## ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఎన్ఎస్పీ అతిథి గృహంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన లెఫ్టినెంట్ గవర్నర్ ఖమ్మంజమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు. జిల్లా పర్యటన సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్, అధికారుల తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు.ఎన్ఎస్పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల విస్తరణ, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు.అదేవిధంగా జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, జిల్లా ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసిన అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాలకు హైదరాబాదు బయలుదేరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలువురు అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# దుబ్బాక మోడల్‌కు రాష్ట్ర ముద్ర..!




మన ప్రజాప్రతినిధి దుబ్బాక నియోజకవర్గం దుబ్బాక మోడల్‌కు రాష్ట్ర ముద్ర..!రాష్ట్రానికి ఆదర్శంగా దుబ్బాక సమీక్షలుచేగుంట నుంచి తొగుట వరకు అభివృద్ధిపై క్షేత్రస్థాయి మంథనంఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వినూత్న కార్యాచరణకు రాష్ట్రస్థాయి గుర్తింపుప్రజాప్రతినిధులుఅధికారులను ఒకే వేదికపైకి తెచ్చిన సమీక్షలుఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు నిర్వహించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదే తొగుట: అభివృద్ధి అంటే కేవలం పనుల ప్రారంభం కాదు.. వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ కూడా అంతే ముఖ్యమనే భావనతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేపట్టిన మండలాల వారీ సమీక్ష సమావేశాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. చేగుంట మండలంతో ప్రారంభమైన ఈ సమీక్షల పరంపర నేడు తొగుట వరకు చేరుకుని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతులు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర అంశాలపై లోతైన సమీక్ష నిర్వహించారు.. రాష్ట్రం లో జిల్లా, మండల పరిషత్ పాలక వర్గం లేకపోవడంతో సర్పంచ్ లకు అధికారులకు మధ్య జవాబుదారి తనం, పర్యవేక్షణ కరువైంది.. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో దుబ్బాకలో అమలవుతున్న ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులకు సూచించడం ఈ సమీక్షల ప్రత్యేకతను చాటుతోంది. కొద్ది రోజుల క్రితం చేగుంట, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లో మండల సమస్యలపై సమీక్ష నిర్వహించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు పలు పంచాయతీ రాజ్ రోడ్ల మంజూరు గురుంచి మంత్రి సీతక్క ను కలవడం జరిగింది.. ఈ సందర్భంగా తన నియోజకవర్గం లో మండల వారీగా చేస్తున్న సమీక్షల గురుంచి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.. నిజమే జిల్లా పరిషత్, మండల. పరిషత్ పాలక వర్గాలు లేకపోవడంతో అధికారులు, సర్పంచ్ ల మధ్య దూరం పెరిగిపోయిందని, దుబ్బాక స్ఫూర్తి తో రాష్ట్రం అంతటా కార్యక్రమం లు నిర్వహిస్తామని ఈనెల 24న రాష్ట్ర వ్యాప్తంగా ఆదేశాలిచ్చారు.. 45రోజులకు ఒకసారి మంగళవారం, బుధవారం రోజున ప్రతి మండలం లో సర్పంచ్ లు, అధికారులతో సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు..ప్రతి సమస్యకు గడువు విధిస్తూ, శాఖల మధ్య సమన్వయంతో పరిష్కారానికి దిశానిర్దేశం చేస్తూ ప్రజాపాలనకు కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్న దుబ్బాక మోడల్ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు మరింత చేరువైన, జవాబుదారీతనం కలిగిన పాలనకు ఈ సమీక్షలు నిదర్శనంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే ముందస్తు పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వినిపిస్తున్నాయి.ఈ కార్యక్రమంలోతెలంగాణ రాష్ట్ర ఎస్ సి ఎస్ టీ కమిషన్ చేర్మెన్ బక్కి వెంకటయ్య. తో పాటు బి ఆర్ ఎస్ నాయకులు బారిసంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదర్శ మారుతి షోరూమ్‌లో నూతన మారుతి సుజుకి బ్రీజా కారును ప్రారంభించిన
## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి




ఎన ప్రజా ప్రతినిధి దినపత్రికజనగామ పట్టణంలోని ఆదర్శ మారుతి షోరూమ్‌లో మారుతి సుజుకి సంస్థ నూతన వెర్షన్ బ్రీజా కారును జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా నూతన వాహనాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించి తొలి వాహనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు మాట్లాడు తూ...ఆటోమొబైల్ రంగంలో మారుతి సుజుకి సంస్థ ఎప్పటికప్పుడు వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికత, అత్యాధునిక భద్రతా ప్రమాణాలు, ఆకర్షణీయమైన డిజైన్‌తో కూడిన వాహనాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమ న్నారు.షోరూమ్ ప్రతినిధులు నూతన బ్రీజా వాహనంలోని ప్రత్యేకతలను ఎమ్మెల్యే గారికి వివరించారు. కొత్త మోడల్‌లో అందుబాటులోకి తీ సుకువచ్చిన సాంకేతిక సదుపాయాలు, భద్రతా ఫీచర్లు, ఆకర్షణీయ మైన ఇంటీరియర్ మరియు ఎక్స్‌టీరియర్ డిజైన్ వినియోగదా రులకు మరింత మెరుగైన అనుభవాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.

## ఆదర్శ మారుతి షోరూమ్‌లో నూతన మారుతి సుజుకి బ్రీజా కారును ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజక వర్గం.జనగామ పట్టణంలోని ఆదర్శ మారుతి షోరూమ్‌లో మారుతి సుజుకి సంస్థ నూతన వెర్షన్ బ్రీజా కారును జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,బుధవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సంద ర్భంగా నూతన వాహనాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించి తొలి వాహనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాట్లాడు తూ...ఆటోమొబైల్ రంగంలో మారుతి సుజుకి సంస్థ ఎప్పటికప్పుడు వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికత, అత్యాధునిక భద్రతా ప్రమాణాలు,ఆకర్షణీయమైన డిజైన్‌తో కూడిన వాహనాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమ న్నారు.షోరూమ్ ప్రతినిధులు నూతన బ్రీజా వాహనంలోని ప్రత్యేకతలను ఎమ్మెల్యే కి వివరించారు.కొత్త మోడల్‌లో అందుబాటులోకి తీ సుకువచ్చిన సాంకేతిక సదుపాయాలు,భద్రతా ఫీచర్లు,ఆకర్షణీయ మైన ఇంటీరియర్ మరియు ఎక్స్‌టీరియర్ డిజైన్ వినియోగదా రులకు మరింత మెరుగైన అనుభవాన్ని అందిస్తాయని పేర్కొన్నారు

# దుబ్బాక మోడల్‌కు రాష్ట్ర ముద్ర



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జులై 29,చేగుంట మండలం, అభివృద్ధి పనులు ప్రారంభించడం మాత్రమే కాకుండా వాటి అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే నిజమైన ప్రజాపాలన అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేపట్టిన మండలాల వారీ అభివృద్ధి సమీక్ష, సమావేశాలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. చేగుంట మండలంతో ప్రారంభమైన ఈ సమీక్షల పరంపర, ఇప్పుడు దౌల్తాబాద్, రాయపోల్, అక్బర్‌పేటభూంపల్లి, మిరుదొడ్డి, దుబ్బాక, తొగుట మండలాలకు విస్తరించింది. సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జిల్లా, మండల స్థాయి అధికారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల అమలుపై సమగ్రంగా సమీక్షించడం విశేషంగా నిలిచింది.ప్రస్తుతం రాష్ట్రంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ పాలకవర్గాలు లేని పరిస్థితుల్లో సర్పంచులు, అధికారుల మధ్య సమన్వయం, జవాబుదారీతనం పెంచేందుకు ఈ విధానం కొత్త దిశను చూపుతోంది. ఇటీవల పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి నియోజకవర్గ రోడ్ల అభివృద్ధి ప్రతిపాదనలు అందజేసిన సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఈ విధానాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రతి 45 రోజులకు ఒకసారి మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని రాష్ట్రవ్యాప్తంగా ఆదేశాలు జారీ చేశారు. దుబ్బాక మోడల్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం గర్వకారణమని, ప్రజలకు మరింత చేరువగా పాలన అందిస్తామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు

# మురికి కూపంగా మారిన డ్వాక్రా భవనం...
# తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పెన్షన్ దారులు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ జవహర్ నగర్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ హాస్పిటల్ పక్కనే ఉన్నటువంటి డ్వాక్రా భవన్ లో ప్రతి నెల దివ్యాంగులకు మరియు వృద్ధులుకు పెన్షన్ పంపిణీ చేస్తారు.పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలతో పేరుకపోయిన చెత్తచెదారంతో మురికి కూపంగా మారిందని దివ్యాంగులు మరియు వృద్ధులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా వర్షాకాల దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పరిసర ప్రాంతాలు పరిశు భ్రంగా ఉండే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. దివ్యాంగులు పెన్షన్ తీసుకున్న కౌంటర్ల వద్ద కనీస రేకుల షెడ్డు కూడా లేకపోవడంతో ఎండకి ఎండుతూ వానకి తడుస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా కనీస వసతులు కల్పిస్తారని మా తరఫున ప్రార్థన.

## రాజ్యలక్ష్మి మృతి పట్ల ఉద్యమకారుల ఫోరం నివాళులు
## ఉద్యమకారుడు అంబటి అంజయ్య గౌడ్ కు మాతృవియోగం



మన ప్రజా దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. ప్రముఖ తెలంగాణ ఉద్యమకారుడు, రిపోర్టర్ అంబటి అంజయ్య గౌడ్,రామవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి సిద్దయ్య ల మాతృమూర్తి రాజ్యలక్ష్మి (80) మంగళవారం అర్ధరాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు.గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజ్యలక్ష్మి సిద్దిపేట జిల్లాలోని ఆర్.వీ.ఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.ఈ విషయం తెలియగానే చేర్యాల పట్టణంలోని వారి స్వగృహంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో పలువురు ఉద్యమకారులు,పాత్రికేయులు,ప్రజాప్రతినిధులు వారి ఇంటికి చేరుకుని రాజ్యలక్ష్మి పార్థివ దేహంపై పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి అందె అశోక్ మాట్లాడుతూ.. రాజ్యలక్ష్మి ఒక ఆదర్శ మాతృమూర్తి అని,కొడుకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేందుకు ఆమె ఎంతో ప్రోత్సాహం అందించారని కొనియాడారు.ఆమె మృతి తీరని లోటని అన్నారు.అనంతరం అనంతరం ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల ఉపాధ్యక్షుడు ఎండి.జహూరద్దీన్, సహాయ కార్యదర్శి బండోజు భాస్కర్,అరుట్ల బాల నర్సయ్య,1969 తెలంగాణ ఉద్యమకారులు

# అదుపుతాప్పి కారు బోల్తా



మన ప్రజా ప్రతినిధి కొండపాక :మండల కేంద్రం లోని రవీంద్రనగర్ వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన లో ముగ్గురికి స్వల్ప గాయాలు సిద్దిపేట చెందిన అశోక్ 50, లహరి 32, ప్రసాద్ 38....ఒకే కుటుంబానికి చెందిన వీరు హైదరాబాద్ లో వారి బంధువులు చనిపోతే వెళ్లి తిరిగి సిద్దిపేట వస్తుండగా రవీంద్ర నగర్ వద్ద వీరి కారు అదుపుతాప్పి బోల్తా పడటం తో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు 108 కు సమాచారం ఇవ్వగ ఘటన స్థలానికి చేరిన 108 సిబ్బంది గాయపడిన వ్యక్తులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.